క్లుప్తంగా

సచివాలయాల్లో తనిఖీ

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలోని 5 / 1, 2, 6 / 1, 2 స్టోన్‌హౌస్‌పేట, పప్పులవీధిలో గల వార్డు సచివాలయాలను కమిషనర్ వికాస్ మర్మత్ శనివారం తనిఖీ చేశారు. ఇన్‌స్పెక్షన్, హాజరు రిజిస్టర్లు, నోటీస్ బోర్డు, తదితరాలను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న సేవలను గడువులోపు పూర్తి చేయాలని, సాంకేతిక అంశాలపై కార్యాలయం నుంచి నేరుగా సూచనలు పొందాలని సచివాలయ కార్యదర్శులకు సూచించారు. ఎస్డీజీ, భూ హక్కు సర్వేలు, ఏపీ సేవా పోర్టల్ అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి, యాక్షన్ ప్లాన్‌ను అమలు చేయాలని పేర్కొన్నారు. స్పందన, జగనన్నకు చెబుదాం ఫిర్యాదులు, నాడు – నేడు పనుల పురోగతి, ఆస్తి పన్ను, యూజర్ చార్జీల వసూళ్లను వేగవంతం చేయాలని ఆదేశించారు. అనంతరం పప్పులవీధి మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ వీధిలో స్పందన ఫిర్యాదును పరిశీలించారు. రోడ్డుకు అడ్డంగా నిలుపుతున్న పార్శిల్ లారీలతో స్థానికులకు తలెత్తుతున్న అసౌకర్యాన్ని పరిశీలించారు. భారీ స్థాయిలో సరుకుల ఎగుమతులు, దిగుమతులు జరుపుకొనేందుకు ఇతర ప్రాంతాల్లో గోదాములను ఏర్పాటు చేసుకోవాలని, అడ్డంకులను మూడు రోజుల్లో పూర్తి స్థాయిలో తొలగించాలని ఆదేశించారు.

రిటైల్ మెగా రుణమేళా



నెల్లూరు(బారకాసు): ప్రాజెక్ట్ పవర్ పథకంలో భాగంగా ఎమ్మెస్మెఈ, రిటైల్ మెగా రుణమేళాను యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, నెల్లూరు రీజినల్ కార్యాలయ ఆధ్వర్యంలో నగరంలోని ఉమేష్ చంద్ర మెమోరియల్ కాన్ఫరెన్స్ హాల్లో శనివారం నిర్వహించారు. ముంబైలోని కేంద్ర కార్యాలయ జనరల్ మేనేజర్ జ్ఞానరంజన్‌సారంగి, రీజినల్ మేనేజర్ జోగారావు హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా సారంగి మాట్లాడారు. దేశ ఆర్థికాభివృద్ధికి యూనియన్ బ్యాంక్ ఎల్లవేళలా సహకారాన్ని అందిస్తోందని చెప్పారు. అనంతరం సీఎస్సార్‌లో భాగంగా అయ్యప్పగుడి సమీపంలోని ప్రగతి చారిటీస్‌కు ఎయిర్ కూలర్‌ను అందజేశారు.

కాంట్రాక్ట్ అధ్యాపకుల కృతజ్ఞతలు

నెల్లూరు రూరల్: కాంట్రాక్ట్ అధ్యాపకులను క్రమబద్ధీకరించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కాంట్రాక్ట్ లెక్చరర్స్ అసోసియేషన్ నేతలు కృతజ్ఞతలను తెలియజేశారు. ఈ మేరకు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో శనివారం సత్కరించారు.

అధ్యాపకులకు ముగిసిన శిక్షణ

నెల్లూరు (టౌన్): ఇంగ్లిష్ మీడియంలో బోధన అనే అంశంపై జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అధ్యాపకులకు నగరంలోని డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమం శనివారంతో ముగిసింది. అనంతరం అధ్యాపకులకు సర్టిఫికెట్లను అందజేశారు. ప్రిన్సిపల్ గిరి, ట్రెయినర్లు మక్బూద్, వల్లీనాథ్, పీఆర్వో జోజీ, తదితరులు పాల్గొన్నారు.

పేదపిల్లలకు వరం విద్యాకానుక

పొదలకూరు : జగనన్న విద్యాకానుక పేదపిల్లల పాలిట వరంగా మారిందని అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్(ఐటీడీపీ) వై.శాంత కుమారి పేర్కొన్నారు. మండలంలోని అమ్మవారిపాళెం, మొగళ్లూరు గ్రామాల్లో గిరిజన ప్రాథమిక పాఠశాలలను ఏఎంఓ శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు విద్యాకానుక కిట్లను అందజేశారు. బడిఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాల్సిందిగా సూచించారు. నాడు–నేడు పథకం కింద పాఠశాలల రూపురేఖలు మారుతున్నాయన్నారు. కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వం పాఠశాలలను తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. జగనన్న గోరుముద్ద, పిల్లల హాజరు రికార్డులను పరిశీలించారు. ఆమె వెంట ఎడ్యుకేషనల్ సెక్రటరీలు రాజేంద్రప్రసాద్, రేబేదాబేగం, పాఠశాలల హెచ్‌ఎంలు సుకన్య, శ్రీనివాసులు, అంగన్‌వాడీ టీచర్లు జయంతి, ప్రసన్న ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

వెంకటాచలం: మోటార్ బైక్ అదుపుతప్పి పడడంతో ఓ వ్యక్తి గాయపడిన ఘటన మండలంలో కసుమూరు వద్ద శనివారం జరిగింది. నెల్లూరు నగరానికి చెందిన విష్ణు పనినిమిత్తం బైక్‌పై కసుమూరుకు వచ్చాడు. తిరిగి నెల్లూరుకు వెళ్తుండగా కసుమూరు పంచాయతీ పరిధిలోని చింతలపాళెం సమీపంలో బైక్ అదుపుతప్పి పడింది. ఈ ప్రమాదంలో విష్ణుకు గాయాలవ్వగా చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

నైపుణ్యాభివృద్ధిపై శిక్షణ

వెంకటాచలం: రాజీవ్ గాంధీ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యూత్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న వీఎస్‌యూలో విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధిని పెంపొందించేందుకు జరుగుతున్న శిక్షణ తరగతులు ముగిశాయి. కార్యక్రమానికి హాజరైన వివిధ కళాశాలల ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారులకు వీఎస్‌యూ రిజిస్ట్రార్ రామచంద్రారెడ్డి, ప్రిన్సిపల్ విజయానంద్‌కుమార్‌బాబు, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ ఉదయ్‌శంకర్ చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందజేశారు.

ముంగిటకే సర్కార్ సేవలు

- సచివాలయ వ్యవస్థతో సుపరిపాలన
- జవాబుదారీతనంతో పనులు వేగవంతం
- సంక్షేమ పథకాల లబ్ధి
- సమస్యలకు త్వరితగతిన పరిష్కారం





కందమూరు సచివాలయం



ములుమూడిలో ప్రజలకు అందిస్తున్న సేవలు

నెల్లూరు రూరల్: ప్రభుత్వం ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థతో ప్రజల సమస్యలు సులభంగా పరిష్కారమవుతున్నాయి. గతంలో చిన్న పనులకు సైతం మండల కేంద్రాలకు పలుమార్లు వెళ్లి ఆయా కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేది. అప్పటికీ సమస్యలు పరిష్కారమయ్యేవి కావు. అయితే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సారథ్యంలో ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రజలకు అన్ని సేవలు సచివాలయాల ద్వారా అందుతున్నాయి. స్వల్ప వ్యవధిలోనే సమస్యలు పరిష్కారానికి నోచుకుంటున్నాయి. నెల్లూరు రూరల్ పరిధిలోని ప్రజలు సచివాలయ సేవలను సద్వినియోగం చేసుకుంటున్నారు.

సచివాలయాల పరిధి ఇలా..

- రూరల్ మండలంలో 18 పంచాయతీలున్నాయి. ఆమంచర్ల సచివాలయ పరిధిలో ఆమంచర్ల, మట్టెంపాడు, అన్నవరప్పాడు, అప్పయ్యకండ్రిగ, సిద్ధవరప్పాడు, గోటువారికండ్రిగ, సేవాదూత్ కాలనీ.. దేవరపాళెం సచివాలయ పరిధిలో దేవరపాళెం, ఇసనాకవారిపాళెం.. దొంతాలి సచివాలయ పరిధిలో దొంతాలి.. గొల్లకందుకూరు సచివాలయ పరిధిలో గొల్లకందుకూరు, సజ్జాపురం ఉన్నాయి.
- కాకుపల్లి బిట్ – 1 సచివాలయ పరిధిలో సామంతులవారితోపు, నందమూరినగర్, లింగాయపాళెం, కలివెలపాళెం.. కందమూరు సచివాలయ పరిధిలో కందమూరు, ఉప్పుటూరు.. ములుమూడి సచివాలయ పరిధిలో ములుమూడి, కొమ్మరపూడి.. కొండ్లపూడి సచివాలయ పరిధిలో కొండ్లపూడి, రాజగోపాలపురం.. వెల్లంటి సచివాలయ పరిధిలో పాతవెల్లంటి, కొత్త వెల్లంటి.. కాకుపల్లి బిట్ – 2 సచివాలయ పరిధిలో మాదరాజుగూడూరు, ముస్లింపాళెం, కట్టకింద గిరిజన కాలనీ, వడ్డిపాళెం, పల్లిపాళెం ఉన్నాయి.
- పెనుబర్తి సచివాలయ పరిధిలో పెనుబర్తి, పల్లిపాళెం, దళితవాడ.. సౌత్‌మోపూరు సచివాలయ పరిధిలో సౌత్‌మోపూరు, మొగళ్లపాళెం గ్రామాలున్నాయి.

రూరల్ మండలంలోని సచివాలయాలు	: 12
పింఛన్లు పొందే వారి సంఖ్య	: 5485
అందిస్తున్న నగదు	: రూ.1,53,49,750

అర్జీలు (2022 - 23)	
అందినవి	: 18,131
పరిష్కారానికి నోచుకున్నవి	: 17,190
తిరస్కరణకు గురైనవి	: 941

ప్రజల వద్దకే సేవలు



గతంలో చిన్నపాటి పనులకైనా మండల కేంద్రాలకు వెళ్లి అవస్థలు పడాల్సి వచ్చేది. అయితే ప్రస్తుతం సచివాలయాల ద్వారా ప్రజల వద్దకే వారు కోరుకున్న సేవలు అందుతున్నాయి. ఈ వ్యవస్థ ఎంతో బాగుంది. ప్రజల సమస్యలు త్వరితగతిన పరిష్కారమవుతున్నాయి. సచివాలయ సిబ్బంది జవాబుదారీతనంతో వ్యవహరిస్తున్నారు.

– వంశీకృష్ణ, వెల్ఫేర్ సెక్రటరీ, ములుమూడి సచివాలయం

సచివాలయ వ్యవస్థ భేష్



గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రస్తుత ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేయడం ఎంతో బాగుంది. ప్రజల సమస్యలు అక్కడికక్కడే పరిష్కారమవుతున్నాయి. మండల కార్యాలయాలకు వచ్చేవారి సంఖ్య తగ్గుముఖం పట్టింది. అర్హులకు సంక్షేమ పథకాలను అందిస్తున్నాం.

– శైలేంద్రకుమార్, నెల్లూరు రూరల్ ఇన్‌చార్జి ఎంపీడీఓ

సేవలతో ఖుషీ

- రూరల్ మండలంలోని 12 సచివాలయాల ద్వారా అర్హులకు సంక్షేమ పథకాల లబ్ధి చేకూరింది. గత టీడీపీ హయాంలో 4,560 మేర పింఛన్లను అందించేవారు. ఈ సంఖ్య ప్రస్తుతం 5,485కు చేరింది. లబ్ధిదారులకు రూ.1,53,49,750 మేర ప్రతి నెలా చెల్లిస్తున్నారు.
- రూరల్ పరిధిలోని సచివాలయాల్లో 2022 – 23 ఏడాదికి గానూ వివిధ పనులకు 18,131 దరఖాస్తులు అందాయి. వీటిలో 17,190 దరఖాస్తులు పరిష్కారానికి నోచుకున్నాయి. వివిధ కారణాలతో 941 దరఖాస్తులను తిరస్కరించారు.
- వైఎస్సార్ పింఛన్ కానుకతో పాటు కొత్త రేషన్ కార్డుల మంజూరు, రేషన్ కార్డుల్లో పేర్ల తొలగింపు.. నమోదు, కుల, ఆదాయ, నివాస, కుటుంబసభ్యుల ధ్రువీకరణపత్రం, పట్టాదారు పాస్‌పుస్తకాల మంజూరు, సవరణలు, పొలం, ఇళ్ల సర్వే, విద్యుత్, ఇంటి పన్నుల చెల్లింపు, తదితర సేవలను అందిస్తున్నారు.
- ఆరోగ్యశ్రీ కార్డు పొందేందుకు గతంలో అధిక సమయం పట్టేది. అయితే ప్రస్తుతం దరఖాస్తు చేసుకున్న 15 నిమిషాల్లోనే సచివాలయాల వద్ద కార్డును లబ్ధిదారులు పొందగలుగుతున్నారు.



మహిళకు పింఛన్‌ను అందజేస్తున్న వలంటీర్



- ఈ చిత్రంలోని బాలుడి పేరు సమీర్. రూరల్ మండలంలోని ములుమూడికి చెందిన నాయబ్ రసూల్ కుమారుడు. బాలుడు పుట్టుకతోనే దివ్యాంగుడు. ప్రస్తుతం తొమ్మిదేళ్ల వయస్సు. వైఎస్సార్ పింఛన్ కానుక ద్వారా ప్రతి నెలా రూ.మూడు వేలను పొందగలుగుతున్నారు. లబ్ధిదారులకు పింఛన్ మొత్తాన్ని చెల్లించాలంటే వేలిముద్రలు లేదా ఐరిస్‌ను తీసుకోవాలనే నిబంధన ఉంది. అయితే దివ్యాంగుల కోసం ప్రభుత్వం ఈ నిబంధనను సడలించి ప్రత్యేక యాప్‌ను ఏర్పాటు చేసింది. దీంతో ప్రతి నెలా బాలుడి ఫొటో తీసుకుని యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. దీంతో పింఛన్ కానుకను పొందుతున్నారు.



- ఈ చిత్రంలోని మహిళ షేక్ తాహేరా రూరల్ పరిధిలోని ములుమూడిలో నివాసం ఉంటున్నారు. భర్త బాబు బేల్దారీ పనులకెళ్తుంటాడు. ఈమెకు ఇద్దరు పిల్లలున్నారు. 45 ఏళ్లు నిండటంతో వైఎస్సార్ చేయూత పథకం లబ్ధి కలిగింది. దీంతో రూ.18,750 అందుతోంది. ఈ నేపథ్యంలో సరుకులను కొనుగోలు చేసి తన ఇంటి ముందు చిన్నపాటి దుకాణాన్ని ఏర్పాటు చేసి చిరు వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు.

సంక్షేమ పాలన జగన్‌తోనే సాధ్యం

- ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి



సంక్షేమ పథకాలపై కరపత్రాలను అందజేస్తున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు రూరల్: సంక్షేమ పాలనను అందించడం సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని ఎంపీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. 17వ డివిజన్లోని వడ్డిపాళెంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శనివారం ఆయన నిర్వహించారు. సంక్షేమ పథకాలపై కరపత్రాలను ఇంటింటికీ వెళ్లి అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలను సీఎం అందిస్తున్నారని కొనియాడారు. నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో పర్యటించి సమస్యలను తెలుసుకొని, వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి, విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, కార్పొరేటర్ సుధాకర్, రైల్వే బోర్డు సభ్యుడు వెంకయ్య, నేతలు కోటేశ్వరరెడ్డి, హరిబాబుయాదవ్, సునీల్, రమణయ్య, హరిప్రసాద్, శ్రీనివాసులు, సుబ్బారెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, మర్రిపాడు జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ రౌడీయిజాన్ని అణిచేస్తాం



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీ ఆదాల

నెల్లూరు రూరల్: నియోజకవర్గంలో టీడీపీకి చెందిన కొందరు రౌడీయిజం చేస్తున్నారని, వీరి ఆగడాలను అణిచేస్తామని ఎంపీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. 28వ డివిజన్లోని ఒకటో వీధిలో సిమెంట్ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. పార్టీ నేతలు, కార్యకర్తలకు తాను అండగా ఉంటానని చెప్పారు. డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి, విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, పార్టీ డివిజన్ ఇన్‌చార్జి మదన్‌మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


టిడ్కో లబ్ధిదారులకు అవగాహన కల్పించండి



మాట్లాడుతున్న వికాస్ మర్మత్

నెల్లూరు(బారకాసు): టిడ్కో గృహ లబ్ధిదారులకు అవగాహన కల్పించి, రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని కమిషనర్ వికాస్ మర్మత్ సూచించారు. హౌసింగ్ డేలో భాగంగా వెంకటేశ్వరపురంలోని టిడ్కో గృహ సముదాయ ప్రాంగణంలో లబ్ధిదారులకు శనివారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. రిజిస్ట్రేషన్, మార్ట్‌గేజ్ పూర్తయిన గృహాలను లబ్ధిదారులకు వెంటనే అందజేయాలని సూచించారు. గృహ సముదాయాల్లో ఒక బ్లాక్‌కు సంబంధించి ఇప్పటి వరకు 706 మంది లబ్ధిదారులకు రుణాలు మంజూరయ్యాయని.. 365, 430 చదరపు అడుగుల వైశాల్యం గల గృహాలకు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ఇందులో 454 మంది లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసి గృహాలను అందజేస్తామని, 136 మందికి మార్ట్‌గేజ్ డీడ్ పెండింగ్‌లో ఉందని వివరించారు. గృహాల స్వాధీన ప్రక్రియకు 62 మంది లబ్ధిదారులు స్పందించకపోవడంతో వారి దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. 69 మంది లబ్ధిదారులు సాధారణ మొత్తాన్ని ఇప్పటి వరకు చెల్లించని కారణంగా వారి దరఖాస్తులూ పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. పెండింగ్‌లో ఉన్న లబ్ధిదారులకు అవగాహన కల్పించి గృహాలను స్వాధీనం చేసేందుకు తగు చర్యలు చేపట్టాలని తెలిపారు. టిడ్కో ఈఈ ఉమాశంకరశాస్త్రి, తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వృద్ధురాలి మృతి



నెల్లూరు(క్రైమ్): అపస్మారక స్థితిలో ఓ వృద్ధురాలు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల సమాచారం మేరకు.. వేదాయపాళెంలోని ఎన్టీఆర్ విగ్రహ సమీపంలో గల బాలాజీ హార్డ్‌వేర్ షాపు ఎదుట గుర్తుతెలియని వృద్ధురాలు (60) అపస్మారక స్థితిలో శుక్రవారం పడిపోయారు. గమనించిన దుకాణ యజమాని సత్యనారాయణ ఆమెను 108 సాయంతో జీజీహెచ్‌లో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ వృద్ధురాలు మృతి చెందారు. ఘటనపై వేదాయపాళెం పోలీసులకు 26 / 3 సచివాలయ వీఆర్వో సాంబశివ శనివారం ఫిర్యాదు చేశారు. మృతదేహాన్ని పోలీసులు పరిశీలించారు. మృతురాలి వద్ద ఎలాంటి వివరాలు లభ్యం కాలేదు. మృతదేహాన్ని మార్చురీకి తరలించి పోలీసులు కేసు నమోదు చేశారు. మృతురాలి వివరాలు తెలిసిన వారు వేదాయపాళెం పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించాలని ఇన్‌స్పెక్టర్ నారాయణ కోరారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని 33 కేవీ డీఎస్సార్ ఇండోర్ సబ్‌స్టేషన్ పరిధిలో గల ప్రగతినగర్‌లో నిర్మాణ పనులను చేపట్టనున్న నేపథ్యంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఆదివారం ఉండదని నెల్లూరు టౌన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సోమశేఖర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. లేక్‌వ్యూ కాలనీ, ప్రగతినగర్‌లోని ఏ, బీ బ్లాక్‌లు, పొదలకూరు రోడ్డు, తదితర ప్రాంతాల్లో ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదని చెప్పారు.

పరిహారాన్ని పెంచాలని వినతి

నెల్లూరు(దర్గామిట్ట): జాతీయ రహదారి ఏర్పాటుతో కోల్పోతున్న భూములకు పరిహారాన్ని పెంచాలని పలువురు కోరారు. ఈ మేరకు కలెక్టర్ హరినారాయణన్‌కు వినతిపత్రాన్ని శనివారం అందజేశారు. మర్రిపాడు మండలం చుంచులూరు నుంచి కృష్ణపట్నానికి జాతీయ రహదారి అనంతసాగరం మండలం వెంగంపల్లి, లింగంగుంట, పాతదేవరాయపల్లి, తదితర గ్రామాల మీదుగా వెళ్తుందన్నారు. దీనికి నష్టపరిహారాన్ని పెంచాలని కోరారు.

స్పాస్టిక్స్ సెంటర్‌లో ఫాదర్స్ డే

నెల్లూరు(అర్బన్): మద్రాస్ బస్టాండ్ సమీపంలోని రెడ్‌క్రాస్ స్పాస్టిక్స్ సెంటర్‌లో ఫాదర్స్ డేను రాయల్ లియో లయన్స్ క్లబ్ ఆఫ్ నెల్లూరు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. రాధాకృష్ణయ్య జ్ఞాపకార్థం పది మంది తల్లులు, తండ్రులను రాయల్ లియో లయన్స్ క్లబ్ ఆఫ్ నెల్లూరు ప్రెసిడెంట్ వర్షిత, కార్యదర్శి అభినవ్ ఆధ్వర్యంలో సత్కరించారు. రెడ్‌క్రాస్ ఎమ్సీ మెంబర్ రాజేంద్రప్రసాద్, స్పాస్టిక్స్ సెంటర్ ప్రిన్సిపల్ గుర్నాధరావు, గాయత్రి, తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలపై ప్రత్యేక దృష్టి

- మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



మాట్లాడుతున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట): సర్వేపల్లి నియోజకవర్గంలోని రెవెన్యూ సమస్యలను రెండున్నర నెలల్లో పరిష్కరించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆదేశించారు. సర్వేపల్లి నియోజకవర్గంలోని రెవెన్యూ సమస్యలపై కలెక్టర్ హరినారాయణన్, జేసీ కూర్మనాథ్, ఆర్డీఓ మలోల, నియోజకవర్గ తహసీల్దార్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లతో రెండో సమీక్ష సమావేశాన్ని కలెక్టరేట్లోని శంకరన్ హాల్లో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. మొదటి సమావేశంలో చర్చించిన కొన్ని అంశాలు పరిష్కారమయ్యాయని, ఇది మంచి పరిణామమని చెప్పారు. మిగిలిన వాటిని రానున్న 75 రోజుల్లో పరిష్కరించాలని సూచించారు. అసైన్డ్ భూములను ఎవరైతే సాగు చేసుకుంటున్నారో, నిబంధనల మేరకు వారికి పట్టాలివ్వాలని సూచించారు. కొంతమంది వీఆర్వోలు బాధ్యతాయుతంగా వ్యవహరించకపోవడంతో రైతుల సమస్యల పరిష్కారంలో జాప్యం జరుగుతోందని తెలిపారు. భూసేకరణ పరిహారంలో రైతులు నష్టపోకుండా సరైన ధర ఇవ్వాలని కోరారు. సమస్యలపై కలెక్టర్ క్రియాశీలకంగా స్పందించి, అజెండాను తయారు చేయించి చర్చించారని, సమావేశం ఫలవంతంగా జరిగిందన్నారు. నేలటూరు పునరావాసానికి సంబంధించిన మత్స్యకారులకు తీర ప్రాంతాల్లోనే స్థలాలను ఇవ్వాలని కోరారు. అనంతరం కలెక్టర్ మాట్లాడారు. రెవెన్యూ అధికారుల దృష్టికి మంత్రి తీసుకొచ్చిన సమస్యలను 100 శాతం పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. భూ సమస్యలకు సంబంధించిన ప్రతిపాదనలను కలెక్టర్ కార్యాలయానికి ఈ నెల 27లోపు పంపాలని సూచించారు. సీపీఓ రాజు, తదితరులు పాల్గొన్నారు.

కాంతిప్రియకు అభినందన



నెల్లూరు(పొగతోట): మిసెస్ ఇండియా వరల్డ్ వైడ్ పోటీల్లో విజయం సాధించిన నందిమండలం కాంతిప్రియను ఆదర్శంగా తీసుకొని మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని డీపీఓ సుస్మితారెడ్డి పేర్కొన్నారు. మిసెస్ ఇండియా వరల్డ్ వైడ్ కాంటెస్ట్‌లో బ్యూటీ అండ్ బ్రెయిన్ విభాగంలో విజయం సాధించిన కాంతిప్రియను నగరంలోని జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయంలో డీపీఓ శనివారం అభినందించారు. ఈ సందర్భంగా కాంతిప్రియ మాట్లాడారు. నెల్లూరుకు చెందిన తమ కుటుంబం ఉద్యోగరీత్యా అమెరికాలో ఉంటున్నామన్నారు. దుబాయ్‌లో నిర్వహించిన మిసెస్ ఇండియా వరల్డ్ వైడ్ కాంటెస్ట్‌లో సుమారు 500 మందికిపైగా పాల్గొన్నారని, ఇందులో బహుమతిని పొందడం ఆనందంగా ఉందని చెప్పారు. భర్త సురేంద్ర, కుటుంబసభ్యుల ప్రోత్సాహంతో పోటీల్లో పాల్గొన్నానని తెలిపారు.

రంగడి సన్నిధిలో రేకుల షెడ్డు నిర్మాణం

నెల్లూరు(బృందావనం): నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థాన అభివృద్ధిలో భాగంగా రూ.40 లక్షలతో రేకుల షెడ్డును నిర్మించనున్నామని ఈఓ వెంకటేశ్వర్లు, ధర్మకర్తల మండలి చైర్మన్ శివకుమార్ ఆచారి తెలిపారు. దాతలు ఆల్తూరు మహేష్‌కుమార్‌రెడ్డి, రాధిక దంపతుల ఆధ్వర్యంలో రేకుల షెడ్డును నిర్మించనున్నారని చెప్పారు. నిర్మాణ స్థలాన్ని పరిశీలించిన దాతలకు శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, స్వామి వారి చిత్రపటాన్ని అందజేశారు.

చేనేతల ధర్నా జయప్రదానికి పిలుపు



నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం నిర్వహించనున్న చేనేతల ధర్నాను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్సీ, చేనేత సంక్షేమ ఐక్యవేదిక జాతీయ ప్రధాన కార్యదర్శి బూదాటి రాధయ్య పిలుపునిచ్చారు. నగరంలోని నెల్లూరు హాస్పిటల్లో విలేకరుల సమావేశాన్ని శనివారం నిర్వహించారు. చేనేత కార్మిక సంఘ జిల్లా కన్వీనర్ వెంకటేశ్వర్లు, పముజుల హరి, కోటేశ్వరరావు, కమలాకర్, తదితరులు పాల్గొన్నారు.

2న భజన, వక్తృత్వ పోటీలు

నెల్లూరు(బృందావనం): గురుపూర్ణిమను పురస్కరించుకొని సుజాతమ్మ కాలనీలోని కృష్ణయోగ మందిరంలో భజన, వక్తృత్వ పోటీలను జూలై రెండున నిర్వహించనున్నామని గణపతి సచ్చిదానంద కృష్ణ జ్ఞానబోధ సభ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ సర్వేపల్లి అజయకుమార్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గణపతి సచ్చిదానందస్వామి దివ్యనామ సంకీర్తనతో భజన పోటీలను నిర్వహించనున్నామని, దీనికి వయోపరిమితి లేదని చెప్పారు. దత్తాత్రేయ స్వామి అంశంపై వక్తృత్వ పోటీలను నిర్వహించనున్నామని, పాల్గొనేందుకు ఐదు నుంచి 18 ఏళ్లలోపు వారు మాత్రమే అర్హులన్నారు. వివరాలకు 94415 48655, 86135 00294 నంబర్లను సంప్రదించాలని సూచించారు.